## కథ

# బరువు

### వాణిశ్రీ


గత కొంత కాలంగా హైదరాబాద్ నగరానికి కొత్త ప్రాబ్లమ్ వచ్చిపడింది. నగరంలో ఉన్న రోడ్లు వాహనాలు తిరగ డానికి సరిపోవడం లేదు. గంటల తర బడి వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కు కుపోవడం మామూలైంది. రోడ్లు ఎంత వెడల్పు చేసినా, ఎన్ని ఫ్లై ఓవర్లు నిర్మిం చినా సమస్య తీరదని ట్రాఫిక్ పోలీసులు సరికొత్త ప్రయోగం చేశారు. బహుశా ప్రపంచంలో ఇటువంటి ప్రయోగం ఏ నగరంలోనూ జరిపి ఉండరు.

నగరంలో ట్రాఫిక్ జామ్‌కి కారణం స్కూల్ బస్సులేననే మహా త్తర సత్యం గ్రహించిన దొరతనం వాటి నియంత్ర ణకి నడుం బిగించారు.

ఇక నుంచీ స్కూల్స్ ఉదయం ఎనిమిదింటికి మొదలై మిట్టమధ్యాహ్నం రెండింటికి క్లోజైపోవాలి. నాలుగు తర్వాత స్కూలు బస్ రోడ్డు మీద కనిపిస్తే తాటవలవడమే అని హుకుం జారీ చేశారు.

ట్రాఫిక్ పోలీసుల ఆర్డర్ అరుంధతి చావు కొచ్చి పడింది. మామూలుగా అయితే తను తొమ్మిదింటికి పిల్లలిద్దర్నీ స్కూలు దగ్గర వదిలి డ్యూటీకి వెళ్లిపోయేది. సాయంకాలం నాలుగు గంటలకు స్కూలు అయ్యాక ఆరు వరకూ అక్కడే ట్యూషను. తను వస్తూ వాళ్లని వెంట బెట్టుకుని ఇల్లు చేరేది. ఇంటికి ఫర్లాంగు దూరంలోనే స్కూలు ఉండడంతో సౌకర్యంగా ఉండేది.

ఇప్పుడు కొత్త వేళలు రావడంతో ఎనిమిదింటికి స్కూలుకెళ్లి పిల్లల్ని దిగబెట్టి మళ్లీ వెనక్కి రావడం, మళ్లీ డ్యూటీకి వెళ్లడం ప్రాబ్లమైంది. మళ్లీ రెండు గంటలకు పిల్లల్ని ఇంటికి తెచ్చుకునేది ఎల్లా? తనకి స్కూటర్ ఉన్నా కూడా పిల్లల డ్యూటీ కుదరదు అని ఘంటాపథంగా చెప్పేశాడు శ్యామలరావు. అతనే అరుం



ధతి హిస్బెండ్.

"మరి ఎల్లా?"

"ఉద్యోగం మానెయ్!" అనేశాడు.

ఎంత దుర్మార్గం? తనకి సొంత సంపాదన లేకపోతే అతగాడిచ్చే ముష్టిమీద ఆధారపడాల్సిందే గదా! అని వాపో యింది అరుంధతి. తనకి ఉద్యోగం రాకముందు ప్రతి రూపాయికీ లెక్కలడిగే వాడు.

"ఇప్పుడు కొత్త చీర ఎందుకు? ప్రతి పండగకీ కొత్త చీరలు కొనాలని రూలుందా? నువ్వేమైనా జమీందారు కూతురివా? లేకపోతే పొలిటికల్ లీడర్ డాటర్‌వా డబ్బు మంచి నీళ్లలా ఖర్చు పెట్టడానికి?" అని సతాయించేవాడు.

"మొరార్జీదేశాయ్ ఏం చెప్పేవాడో తెలుసా? ఏదైనా కొనాలని ఆలోచన వచ్చినప్పుడు, అది అవసరమా? అది కొనక పోతే ఏం? అది లేనందు వలన నష్టం ఏమిటి? వగైరా ఆలోచనలు చెయ్యమన్నాడు. ఎన్ని ఆలోచనలు చేసినా కొనాలని బుద్ధి మారనప్పుడు బజారెళ్లి కూడా 'రేపు కొందాంలే' అని ఇంటికి తిరిగివచ్చెయ్యమన్నాడు" అంటూ ఏవేవో చెప్పి విసిగించేవాడు.

అన్నం మిగిలితే కూడా ఎవరికీ పెట్టనిచ్చేవాడు కాదు. 'మిక్సీలో వేసి అట్లు పోయవచ్చుగా, పచ్చిమిరపకాయలు దంచి, జీలకర్ర కలిపి వడియాలు పెట్టొచ్చు' అని సలహాలు ఇచ్చేవాడు. ఈ పీనాసి పుల్లయ్యతో వేగలేకే జాబ్‌లో చేరిపో యింది. ఇన్నాళ్లూ ప్రాణానికి హాయిగా ఉంది. దర్జాగా సంపాదించుకుంటూ ఇష్టమైనవి కొనుక్కుంటోంది.

ఇప్పుడీ స్కూలు వేళలు మారడంతో ఉద్యోగానికి ఎసరు వచ్చేలా ఉంది అనుకుని తను కూడా రకరకాల ప్రయోగాలు మొదలుపెట్టింది.

వేలువిడిచిన మేనత్తను ఇంట్లో తెచ్చిపెట్టుకుని పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లడానికి, మళ్లీ ఇంటికి తీసుకురావడానికి ఆటో మాట్లాడింది.

నెల గడిచిందో లేదో మేనత్తకి హఠాత్తుగా గుండె నెప్పి అని కూలబడింది. దగ్గర్లోనే హాస్పిటల్‌కి తీసుకెళ్తే ఆ టెస్ట్, ఈ టెస్ట్ అని మూడు రోజులు ఉంచుకున్నారు. గుండె బాగానే ఉంది గ్యాస్ ప్రాబ్లెమ్. నూనెలు, మసాలాలు తిన కండి అని సలహాలు ఇచ్చి పదిహేను వేలు బిల్లు కట్టించుకు న్నారు. అరుంధతి లబోదిబో అంది.

"సంతోషించు. బైపాస్... ఆపరేషన్ అని ఉంటే రెండు లక్షలయ్యేది" అన్నాడు శ్యామల రావు.

అరుంధతి హడలిపోయి మేనత్తను రైలె క్కించేసింది.

తర్వాత పనిమనుషుల్ని పెట్టింది. వాళ్లతో ప్రయోగాలు బెడిసికొట్టాయి.

"నా మాట విని జాబ్ రిజైన్ చేసేయ్. అంతగా డబ్బు సంపాదించుకోవాలంటే ఇంట్లోనే చీరలు, జాకెట్ ముక్కలు అమ్ముకో. లేకపోతే అప్పడాలు వత్తి స్వగృహ ఫుడ్స్ షాపు లకి సప్లై చెయ్యి" అన్నాడు శ్యామలరావు.

గ్రాడ్యుయేటయిన తను చదువురాని ఆడ దానిలా అప్పడాలు వత్తుకుని, చీరమ్ముకుని బతకాల్సిన ఖర్మ ఏం పట్టిందని మొగుడిమీద ఎగిరిపడింది.

"ఐతే నీ చావు నువ్వు చావు" అని స్కూటరెక్కి తుర్రుమ న్నాడు శ్యామలరావు.

"ఏం చేయాలిరా దేవుడా" అని అరుంధతి దిగులుపడుతూ ఉండగా సూరప్పగూడెం నుంచి వాళ్లమ్మ ఫోన్ చేసింది "దసరా పండక్కి పిల్లల్ని తీసుకుని రావే" అని.

ఆఫీసుకి వారం సెలవు పెట్టి పిల్లల్ని తీసుకుని పుట్టిం టికి వెళ్లింది అరుంధతి.

వెధవ రూలు పెట్టిన గవర్నమెంటుని, పెట్టించిన ట్రాఫిక్ పోలీసుల్ని తెగ తిట్టి తన గోడు వెళ్లబోసుకుంది తల్లి దగ్గర.

రంగనాయకమ్మ చిరునవ్వు నవ్వి "దీనికింత దిగులెం దుకే. మన ఊరు నుంచి ఒక పనిపిల్లను తీసుకెళ్లి ఇంట్లో పెట్టుకో. తిండి తిప్పలు చూసి సంవత్సరానికి ఇంత డబ్బు ఇస్తామంటే చాలు" అన్నది.

"ఐతే అర్జెంటుగా ఒక పిల్లని చూడవే. నేను వెళ్లేట ప్పుడు వెంట తీసుకెళ్తాను" అన్నది సంతోషపడిపోతూ.

ఆ విధంగా సూరప్పగూడెం నుంచి సీతాలుని తెచ్చు కుంది అరుంధతి. సీతాలుకు పన్నెండేళ్లు. ఇంట్లో పనులన్నీ చేసేది. పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లడం, మధ్యాహ్నం రెండు గంటలకి స్కూలు నుంచి ఇంటికి తీసుకురావడం అన్నీ సమర్థవంతంగా చేస్తోంది. అరుంధతి హేపీగా జాబ్ చేసు కుంటోంది.


సీతాలొచ్చి మూడు నెలలైంది. సంక్రాంతి వస్తోంది. రంగనాయకమ్మ కూతురుకి ఫోన్ చేసింది. సంక్రాంతి పండక్కి ఊరుకి రమ్మని.

"ఆఫీసులో సెలవు దొరకదమ్మా! కుదర్దులే" అన్నది అరుంధతి.

"పది రోజులు సెలవుపెట్టి హాయిగా ఊరెళ్లి రారాదూ!" అన్నాడు శ్యామలరావు.

"ఎందుకూ? నేను ఊరెళ్తే మీరు ఫ్రెండ్స్‌ని కొంపలో చేర్చి మందుపార్టీలు చేసుకోడానికా?" అని మండి పడింది అరుంధతి.

శ్యామలరావు నవ్వి వెళ్లిపోయాడు.




కూతురు పుట్టింటికి రానసేసరికి రంగనాయకమ్మ పెద్దలగేజీతో హైదరాబాద్ వచ్చింది. లగేజీలో అరిసెలు, బూరెలు, కారం బూందీలతో పాటు తేగలు, రేగుపళ్లు వగై రాలన్నీ ఉన్నాయి.

రంగనాయకమ్మ సంక్రాంతి సిటీలో గడిపి తిరుగుప్ర యాణమవుతుంటే సీతాలు ఊరెళ్తానని వెంట పడింది. చిన్నపిల్ల. ఇంటిమీద బెంగపడిందని తీసుకెళ్లడానికి ఒప్పు కుంది రంగనాయకమ్మ. నాలుగు రోజుల్లో తిరిగి రావాలని కండిషన్ మీద సీతాలుని సూరప్పగూడెం పంపింది అరుం ధతి.

నాలుగు రోజులు పోయి వారం, పది రోజులు ఊరెళ్లిన సీతాలు అంతులేదు.

సీతాలు రావడానికి, మళ్లీ వాళ్ల నాన్నకి తోడు రావడా నికి చార్జీలు గూడా ముందే ఇచ్చింది అరుంధతి. ఏం జరి గింది? ఎందుకు రాలేదు? అని టెన్షన్ పడసాగింది.

శ్యామలరావు పాట మొదలుపెట్టాడు.

"వెధవ జాబ్ మానెయ్యరాదూ?" అని.

ఫోన్ చేస్తుంటే కలవడం లేదు. అరుంధతి సీతాలు రాలేదని కంగారు పడుతుండగా రంగనాయకమ్మే ఫోన్ చేసి చావు కబురు చల్లగా చెప్పింది.

"సీతాలు రాదటనే" అని.

"ఏం?"

"అది ఇంట్లో అంట్లు తోమడం, బట్టలు ఉతకడం, ఇల్లు తుడవడం అన్నీ చేస్తుందట"

"మరేం చేయదు?"

"నీ పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లడం, మళ్లీ తిరిగి స్కూలు నుంచి ఇంటికి తీసుకురావడం తన వల్ల కాదంటోంది" చెప్పింది రంగనాయకమ్మ.

"అదెంత పనే? స్కూలు దగ్గరేగా? ఫర్లాంగు కూడా లేదు" అన్నది అరుంధతి.

"స్కూలుకు వెళ్లి రావడం ప్రాబ్లమ్ కాదట"

"మరేమిటి ప్రాబ్లమ్?"

"నీ పిల్లల స్కూలు బ్యాగ్స్ మోయలేదట. వామ్మో! ఎంత బరువో? బియ్యం బస్తాలంత బరువు. నేను వాటిని మోసుకుని నడవలేను. నడుము పడిపోతోంది అని మొత్తు కుంటోంది" అన్నది రంగనాయకమ్మ.

"నా జాబ్‌కి ఎసరొచ్చేట్లుంది. ఇదేం స్కూలు టైమింగ్సో? పెట్టిన వాడికి బుద్ధి లేదు" అని గొణుక్కుంది సగటు ఇల్లాలు అరుంధతి.

"మర్నాడు స్కూలుకెళ్లి పసి పిల్లలకు ఇంత సిలబస్సు ఏంటి? ఇన్నిన్ని టెక్స్ట్ బుక్స్, నోట్సులు, వర్కుబుక్‌లేంటి? అంత బరువు ఎవడు మోస్తాడు?" అని టీచర్ల మీద పోట్లా డింది అరుంధతి.

"ఆ మాత్రం బరువు లేకపోతే చదువు తేలికై పోతుందని" వింత సమాధానం చెప్పారు టీచర్లు.

☆